సాక్షి చిత్తూరు

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



వినాయకునికి వెండి కిరీటం

కాణిపాకం శ్రీవినాయకస్వామికి గురువారం రూ.2.50లక్షల విలువజేసే వెండి కిరీటాన్ని లండ్‌కు చెందిన దాత అందించారు. - 8లో



బ్లాక్‌లో భోళా శంకర్ టికెట్ విక్రయాలు

భోళా శంకర్ చిత్రం బెనిఫిట్ షో పేరుతో చిత్తూరులో అధిక ధరలకు టికెట్లు విక్రయించారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	32	24
తిరుపతి	32	24
తిరుమల	28	21
గూడూరు	35	27
నగరి	34	26

న్యూస్‌రీల్

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన సేవలు



వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి

గుడిపాల: గ్రామీణ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి తెలిపారు. గురువారం 189 కొత్తపల్లెలో 104 వాహనం ద్వారా అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె తనిఖీచేశారు. సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగారు. గర్భిణులు, బాలింతల వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు తలెత్తకూడదని వైద్యాధికారి సందీప్‌ను ఆదేశించారు. ఇంటివద్ద మంచానికే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించి ధైర్యం చెప్పాలని ఆమె తెలియజేశారు. రోగులకు మాత్రలు, మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బంది లక్ష్మీపతి, చంద్రశేఖర్, సుమతి, సోనియా, విజయ, ప్రవీణ్, ఎలవతిలు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులి పురుగులకు చెక్



మాట్లాడుతున్న వెంకటప్రసాద్

యాదమరి: ఆల్బెండజోల్ మాత్రతో నులి పురుగులకు చెక్ పెట్టవచ్చని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తరువాత విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు రక్తహీనత నివారణకు ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. దీంతో కడుపులో నులి పురుగులు చనిపోయి ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఏడాది నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తారని తెలిపారు. వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్, సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

87 నామినేషన్లు దాఖలు

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలో 3 సర్పంచ్, 46 వార్డు స్థానాలకు చివరి రోజు గురువారం 87 నామినేషన్‌లు దాఖలైనట్లు డీపీవో లక్ష్మి తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ జీడీనెల్లూరు మండలం నెల్లేపల్లె సర్పంచ్ స్థానానికి 4, విజయపురం మండలం కాళికాపురం సర్పంచ్ స్థానానికి 1, కార్వేటినగరం మండలం కత్తెరపల్లె సర్పంచ్ స్థానానికి 5 నామినేషన్‌లు, 46 వార్డు మెంబర్ స్థానాలకు 77 నామినేషన్‌లు దాఖలైనట్లు చెప్పారు. గురువారంతో నామినేషన్ ప్రక్రియ ముగిసిందన్నారు. బుధవారం దాఖలైన వాటితో కలిపి మొత్తం 67 నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు.

కుమారస్వామి పురవిహారం



శ్రీకాళహస్తి: ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి గురువారం రథంపై ఆశీనులపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ ఊరేగింపు జరిగింది.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తులు

రేణిగుంట: అమరరాజ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 32వ బ్యాచ్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు సెంటర్ ప్రతినిధులు గురువారం తెలిపారు. చిత్తూరు జిల్లా, పూతలపట్టు మండలం, పేటమిట్టలో ఉన్న కేంద్రంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. టెన్త్, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు నేరుగా పేటమిట్టలోని కేంద్రానికి సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 9000024919, 9100477371 నంబర్లలో సంప్రదించ వచ్చని సూచించారు.

ప్రమాణం.. ప్రణామం!



స్వామిని స్మరించుకుంటున్న టీటీడీ చైర్మన్ భూమన

- అట్టహాసంగా టీటీడీ చైర్మన్ భూమన ప్రమాణ స్వీకారం
- ముందుగా శ్రీవారి చెల్లెలు గంగమ్మకు పూజలు
- అనంతరం తిరుమలకు పయనం
- సంప్రదాయానికి పెద్దపీట వేసిన నూతన చైర్మన్

సాక్షి, తిరుపతి: హైందవ సంప్రదాయాన్ని వెలుగెత్తి చాటుతూ.. సనాతన హిందూ ధర్మాన్ని తూచా తప్పక పాటిస్తూ.. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ.. టీటీడీ నూతన చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి గురువారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా తిరుపతి పద్మావతీపురంలోని తన నివాసంలో ఉదయం టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుల బృందం వేద ఆశీర్వచనాలు అందించగా.. భూమన సంప్రదాయ దుస్తులతో కుటుంబ సమేతంగా శ్రీవారి చెల్లెలు, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. విశేష పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడి నుంచి అలిపిరి గోశాలకు చేరుకుని శ్రీకృష్ణునికి, గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత అలిపిరి పాదాల మండపానికి చేరుకున్న భూమన దంపతులు స్వామివారి పాదుకలను తలపై ఉంచుకుని ఆలయ ప్రదక్షిణ చేశారు. నుదుట తిరునామం.. సరిగంచు పంచె.. ఉత్తరీయం ధరించి సంప్రదాయబద్ధంగా స్వామి సేవకు కుటుంబ సభ్యులతో కలిసి సప్తగిరులను అధిరోహించారు. ముందుగా వరాహస్వామిని దర్శించుకుని అనుగ్రహం పొందారు. ఆపై వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి ఆలయంలోకి ప్రవేశించారు. ఈఓ ధర్మారెడ్డి, అర్చకులు అపూర్వ స్వాగతం పలకగా.. భూమన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కారు. తర్వాత గరుడాళ్వార్ సన్నిధిలో టీటీడీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. రంగనాయకుని మండపంలో టీటీడీ నూతన చైర్మన్ భూమన దంపతులకు పండితులు వేద ఆశీర్వాదం అందించగా.. ఈఓ స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆర్‌కే.రోజా, అంబటి రాంబాబు, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, కమిషనర్ హరిత తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి పాదుకలను తలపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన దంపతులు



తిరుపతి తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుంటున్న టీటీడీ చైర్మన్ భూమన



కుటుంబ సమేతంగా గోపూజ నిర్వహిస్తున్న టీటీడీ చైర్మన్ దంపతులు



ధ్వజస్తంభానికి మొక్కుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



టీటీడీ చైర్మన్‌కు వేదపండితుల ఆశీర్వాదం



ధ్వజస్తంభం వద్ద టీటీడీ చైర్మన్ భూమన, మంత్రి ఆర్కే రోజా



టీటీడీ చైర్మన్ భూమన, ప్రభుత్వ విప్ చెవిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఈఓ ఏవీ ధర్మారెడ్డి

పేదల పక్షపాతి సీఎం జగన్



ఉచిత ప్రయాణం జీఓ విడుదల కావడంతో మంత్రిని అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్వేటినగరం : పేదల అభివృద్ధే ధ్యేయంగా సంక్షేమాలు అందిస్తు వారి పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం పెనుమూరు మండలం రామకృష్ణాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో తలసేమియ, కిడ్నీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.ఐదు వేల నుంచి రూ.10 వేల వరకు పింఛన్ తీసుకుంటున్న సుమారు 50 వేల మందికి ఉచిత బస్సు పాస్‌లు ఇవ్వాలని తాను క్యాబినెట్ సమావేశంలో కోరడంతో వెంటనే స్పందించి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించిన మనసున్న మహానుభావుడు జగనన్న అని గుర్తు చేశారు. ఉచిత ప్రయాణం కోసం సుమారు రూ.28 కోట్లు వ్యయం కానున్నా వెనకడుగు వేయకుండా జీవో అమలు చేసిన సీఎం జగనన్న ప్రభుత్వంలో పనిచేయడం పూర్వజన్మసుకృతమని, అదృష్టంగా భావిస్తున్నానని నారాయణస్వామి చెప్పారు.

డిప్యూటీ సీఎంకు కలెక్టర్ అభినందన

గడప గడప మన ప్రభుత్వం పర్యటనలో ఉండగా ఉచిత ప్రయాణం జీవో వచ్చిందని డిప్యూటీ సీఎంతో జిల్లా కలెక్టర్ షన్మోహన్ ఫోన్ ద్వారా తెలిపారు. మీరు క్యాబినెట్‌లో కోరడంతో పేదలకు ఈ సౌకర్యం కలిగిందని అభినందించారు. ఇలాంటి జీవోలతో ప్రజలు, బాధితులు గుండెల్లో పెట్టుకుని పూజిస్తారని అన్నారు.

పార్లమెంట్ స్థానాలకు ఏఆర్‌వోల నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : పార్లమెంట్ నియోజకవర్గాలకు ఏఆర్‌వోలను నియమిస్తూ గురువారం గెజిట్ నెంబర్ 27 విడుదలైంది. ఆ గెజిట్ మేరకు చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ సెగ్మెంట్‌లకు ఏఆర్‌వో(అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్) లుగా తిరుపతి ఆర్డీవో, నగరి ఆర్డీవో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఐవోసీఎల్, చిత్తూరు), జేసీ(చిత్తూరు), ఆర్డీవో చిత్తూరు, పలమనేరు, కుప్పం, డీఆర్‌వో, చిత్తూరులను నియమించారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్‌లకు స్పెషల్ కలెక్టర్ (తెలుగు గంగ ప్రాజెక్ట్, నెల్లూరు), గూడూరుకు, సూళ్లూరుపేటకు ఆర్డీవోలు, జేసీ (తిరుపతి), మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ (తిరుపతి), ఆర్డీవో శ్రీకాళహస్తి, డిప్యూటీ కలెక్టర్ (ఏపీఐఐసీ, తిరుపతి)ని నియమించారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక దన్ను

నాడు నట్టేట ముంచిన చంద్రబాబు



తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని, ఎవ్వరూ బ్యాంకులకు కంతులు చెల్లించాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆ సంగతి మరిచిపోయారు. దీంతో నాడు రాష్ట్రంలో పొదుపు సంఘాల (డ్వాక్రా) వ్యవస్థ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అప్పటి వరకు సక్రమంగా కంతులు చెల్లించిన వారు ఒక్కసారిగా డీఫాల్టర్లుగా మారిపోయారు. ఫలితంగా సంఘాల కార్యకలాపాల్లో కీలకమైన మహిళలు ప్రతి నెలా పొదుపు చేయడాన్ని అప్పట్లో (2014–18 మధ్య) పక్కన పెట్టేశారు. నెల నెలా సంఘాల వారీగా సమావేశాలు నిర్వహించుకోవడం మానేశారు.

నేడు మహిళలకు ఆర్థిక స్వావలంబన



పొదుపు సంఘ కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున తోడ్పాటు అందజేస్తోంది. 2019లో వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని ప్రారంభించి అప్పటి నుంచి క్రమం తప్పకుండా అందజేస్తూ వస్తోంది. తీసుకున్న రుణాల మొత్తాలను సకాలంలో చెల్లించిన అన్ని సంఘాలకు సున్నా వడ్డీ వర్తింపజేస్తోంది. వడ్డీ మొత్తాలను నేరుగా స్వయం సహాయక సంఘాల అప్పు ఖాతాల్లో జమ చేస్తోంది. జిల్లాలో స్వయం సంఘాల మహిళలకు 2019–20లో రూ.82.53, 2020–21లో రూ.67.69కోట్లు, 2021–22లో రూ.71.76 కోట్ల నిధులు అందించింది. నేడు 2022–23 సంవత్సరానికి రూ. 50.34 కోట్లు అందజేయనుంది.

అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ వైఎస్సార్ సున్నావడ్డీ పథకం ద్వారా ప్రోత్సహిస్తోంది. స్వయం సహాయక సంఘాలు నిర్వహించుకుంటూ ఆర్థికాభివృద్ధి కోసం బ్యాంకుల నుంచి రుణం తీసుకుంటున్న అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తోంది. వారిపై వడ్డీ భారం పడకుండా ప్రభుత్వమే భరిస్తోంది. 2019 నుంచి ఏటా డ్వాక్రా రుణాలకు వడ్డీ మొత్తాలను ప్రభుత్వం తిరిగి చెల్లిస్తోంది. ఇందులో భాగంగానే 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను డ్వాక్రా సంఘాలకు నాలుగో విడత వడ్డీ మొత్తాలను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సున్నా వడ్డీ మొత్తాలను శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా డ్వాక్రా మహిళల ఖాతాలకు నేరుగా జమ చేయనున్నారు. దీంతో డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- నేడు వైఎస్సార్ సున్నా వడ్డీ మహిళల ఖాతాల్లో జమ
- జిల్లాలో 4,39,958 మందికి రూ. 50.34 కోట్ల లబ్ధి
- సున్నా వడ్డీతో మహిళల్లో ఆర్థిక స్వావలంబన
- స్వయం ఉపాధితో పరపతి పెంచుకుంటున్న మహిళలు

నాలుగేళ్లుగా అందించిన సున్నా వడ్డీ మొత్తాలు

సంవత్సరం	సంఘాలు	సభ్యులు	రూ. కోట్లలో
2019–20	34,907	3,83,977	82.53
2020–21	37,957	4,17,527	67.69
2021–22	38,880	4,96,830	71.76
2022–23	34,286	4,39,958	50.34
మొత్తం	1,46,030	17,38,292	272.32



జీడీనెల్లూరు : సున్నా వడ్డీ రుణంతో చిక్కీల యూనిట్ నడుపుతున్న అనిత

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలోని డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం నాలుగేళ్లుగా వైఎస్సార్ సున్నా వడ్డీని అమలు చేస్తూ ఆర్థిక భరోసాను ఇస్తోంది. ఎన్నికల ముందు చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రలో డ్వాక్రా మహిళల కష్టాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళ్లారా చూశారు. అధికారంలోకి రాగానే వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాలకు శ్రీకారం చుట్టారు. 2019లో వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని ప్రారంభించి అప్పటి నుంచి క్రమం తప్పకుండా అందజేస్తూ వస్తున్నారు. తీసుకున్న రుణాల మొత్తాలను సకాలంలో చెల్లించిన అన్ని సంఘాలకు సున్నా వడ్డీ వర్తింపజేస్తున్నారు. వడ్డీ మొత్తాలను నేరుగా స్వయం సహాయక సంఘాల అప్పు ఖాతాల్లో జమ చేస్తున్నారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలకు అయ్యే వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తుండడంతో జీవనోపాధి మెరుగైంది. సంఘాల సభ్యులు సక్రమంగా కంతులు చెల్లించడం ద్వారా అగ్రపథంలో నిలిచి పరపతి పెంచుకుంటున్నారు. ఇంటిని చక్కదిద్దే స్థాయిలో మహిళలు సొంత కాళ్లపై నిలిచేలా సున్నా వడ్డీ రాయితీగా చెల్లిస్తున్న ప్రభుత్వం నాలుగో ఏడాది కూడా జమ చేయనుంది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలో మొత్తం 34,286 సంఘాల్లోని 4,39,958 మంది మహిళలకు రూ. 50.34 కోట్లను సున్నా వడ్డీ కింద చెల్లించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. అందులో గ్రామీణ ప్రాంతాల్లోని 28,705 సంఘాలకు చెందిన 3,76,815మంది మహిళలకు రూ.40.05 కోట్లు, పట్టణ ప్రాంతాల్లోని 5,581 సంఘాలకు చెందిన 63,143 మంది మహిళలకు రూ.10.29 కోట్ల మేరకు సున్నా వడ్డీ మొత్తాలను వారి ఖాతాలకు జమ చేయనుంది.

కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం నాలుగో విడత అమలు చేస్తున్న వైఎస్సార్ సున్నా వడ్డీ జిల్లా స్థాయి కార్యక్రమం శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 34,286 స్వయం సహాయక సంఘాల్లోని 4,39,958 మందికి రూ.50.34 కోట్లను ప్రభుత్వం వారి ఖాతాల్లో నగదు జమ చేయనుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయి కార్యక్రమానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, తదితరులు హాజరు కానున్నారని తెలిపారు.

సీఎంకు రుణపడి ఉంటాం



డ్వాక్రా మహిళలకు ప్రత్యేక పథకాలు అమలు చేస్తూ అన్ని విధాలా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికి రుణపడి ఉంటాం. గత ప్రభుత్వ హయాంలో డ్వాక్రా మహిళలు అప్పులపాలై తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వంలో డ్వాక్రా రుణాలను మాఫీ చేయడంతో పాటు సున్నా వడ్డీని అమలుచేస్తూ మరింత ప్రోత్సాహాన్ని కల్పిస్తున్నారు.

– మాధవి, డ్వాక్రా మహిళ, పెనుమూరు

చాల మంచి తోడ్పాటు...



వైఎస్సార్ సున్నా వడ్డీ డ్వాక్రా మహిళలకు చాల మంచి తోడ్పాటును అందిస్తోంది. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాన్ని అధికారులు చెప్పిన ప్రకారం కంతుల వారీగా చెల్లిస్తున్నాం. 2019 నుంచి ప్రతి ఏటా క్రమం తప్పకుండా సున్నా వడ్డీ మొత్తాలను అందించి ప్రభుత్వం ఆదుకుంటోంది. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఈపథకం మంచి తోడ్పాటును ఇస్తోంది.

–మునిలక్ష్మి, డ్వాక్రా మహిళ

మహిళల ఆర్థికాభివృద్ధేకే



డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే వైఎస్సార్ సున్నావడ్డీని సకాలంలో రుణాన్ని చెల్లించిన మహిళలకు అందిస్తోంది. నాలుగో విడతగా 2022–23 ఏడాదికి గాను 34,286 సంఘాలకు రూ. 50.34 కోట్లను మహిళల ఖాతాలను శుక్రవారం నేరుగా జమ కానుంది.

– తులసి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్

పట్టుదలతో ఉన్నత శిఖరాలు

- లక్ష్యాలను నిర్దేశించుకోవాలి
- క్రీడా పరికరాలు అందజేస్తా
- డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో మంత్రి ఆర్కే రోజా



విజేతలకు బహుమతులు అందిస్తున్న మంత్రి ఆర్కే రోజా

నగరి: లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 45 వార్షికోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కళాశాల నాక్‌లో ఏ ప్లస్ గ్రేడ్‌ను సాధించడం గర్వకారణమన్నారు. పాఠాలను చులకన చేస్తే భవిష్యత్తు గుణపాఠాలు నేర్పుతుందని, మళ్లీ బాధపడ్డా ప్రయోజనం ఉండదని తెలిపారు. పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని తాను చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. మీలా సాధారణ స్థాయి నుంచి వచ్చిన తాను తాను హీరోయిన్నై, నేడు మంత్రిగా ఉండడమే అందుకు నిదర్శనమన్నారు. డిగ్రీ తీసుకున్న వెంటనే పెళ్లి అనే ఆలోచనను విద్యార్థినులు వదిలి పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరిలోను ఒక టాలెంట్ ఉంటుందని అది గుర్తించి లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్య పేదరికాన్ని నిర్మూలిస్తుందన్నారు. చదివే ఓపిక మీకున్నంత వరకు చదివించేందుకు సీఎం జగనన్న ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన స్పోర్ట్స్ మెటీరియల్ అందిస్తానన్నారు. క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు అక్టోబర్ 2వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు మంత్రి బహుమతులు అందజేశారు. ఆర్డీవో సుజన, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 75,594 మంది స్వామివారిని దర్శించుకోగా.. 26,213 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.69 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టోకెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వృద్ధురాలి ఇంట్లో బంగారు దోపిడీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఒంటరిగా నిద్రిస్తున్న ఓ వృద్ధురాలిని బెదిరించి, ఆమె చేతికున్న బంగారు గాజులను ఓ వ్యక్తి దోచుకెళ్లాడు. టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు.. నగరంలోని కన్నయ్య నాయుడు కాలనీకు చెందిన సరోజమ్మ (80) ప్రభుత్వ ఆస్పత్రిలో హెడ్‌నర్సుగా పనిచేస్తూ పదవి విరమణపొందారు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారు. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి సరోజమ్మను కత్తితో బెదిరించి, చేతికున్న 48 గ్రాముల బరువున్న నాలుగు బంగారు గాజులు దోచుకుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇక డిజిటల్ పంచాయతీలు

నగదు రూపంలో వసూళ్లకు గ్రామ పంచాయతీలు ఇకపై గుడ్‌బై చెప్పనున్నాయి. నిధుల వినియోగంలో పారదర్శకత పెంచేందుకు డిజిటల్ చెల్లింపులు మాత్రమే అంగీకరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆదేశించింది. ఈనెల 15 నుంచి మొబైల్ ద్వారా క్యూఆర్ కోడ్‌తో నగదు చెల్లించే ప్రక్రియ ప్రారంభం కానుంది. అప్పటి నుంచి పంచాయతీల్లో నగదు చెల్లింపులకు పూర్తిగా స్వస్తి పలకాల్సి ఉంటుంది. జిల్లా అధికార యంత్రాంగం డిజిటల్ చెల్లింపులు మాత్రమే చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది.

- పారదర్శకంగా లావాదేవీల నిర్వహణ
- ఆన్‌లైన్ విధానంలో చెల్లింపుల ప్రక్రియ
- ఈనెల 15 నుంచి అమలు



మండలాలు	31
గ్రామ పంచాయతీలు	697
ఇంటి పన్ను డిమాండ్ 2022-23	రూ.14,37,76,720
వసూలు	రూ.13,02,23,452
కొళాయి, ఇతర పన్నుల వసూలు	రూ.8,10,64,198
పాత బకాయిలు	రూ.3,05,31,817
అందులో వసూలు	రూ.2,26,31,587

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీల్లో నిధుల వినియోగంలో పారదర్శకత పెంచేందుకు వీలుగా ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలని నిర్ణయించింది. గ్రామ పంచాయతీల ద్వారా సేవలు పొందే లబ్ధిదారులు నిర్ణీత రుసుంతో పాటు ఇంటి యజమానులు ఏటా చెల్లించే ఇంటి పన్ను కూడా డిజిటల్ ఆధారిత రూపంలోనే చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతి గ్రామ పంచాయతీ అధికారిక బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన క్యూఆర్‌కోడ్‌ను అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. వివిధ రకాల డెబిట్, క్రెడిట్ కార్డులు ద్వారా చెల్లింపులు జరిపేలా ప్రత్యేక మెషీన్లను కూడా అన్ని పంచాయతీలకూ సమకూర్చనున్నారు. పంచాయతీల్లో పన్నులకు సంబంధించి ప్రతిది లెక్క పక్కాగా నమోదు కానుంది. ఏ పంచాయతీ పరంగా ఎంత మొత్తం పన్నులు వసూలు అయింది, ఎంత కావాలనే విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. కార్యదర్శుల పనితీరు ఉన్నతాధికారులకు తెలుస్తోంది. గతంలో పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంగా ఉన్న 58 మంది కార్యదర్శులకు డీపీఓ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. డిజిటల్ చెల్లింపుల ప్రక్రియ ద్వారా నిర్లక్ష్యానికి చెక్ పెడుతారు. దీనివల్ల ప్రజల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయి పంచాయతీఖాతాకు వెళుతుంది. పంచాయతీ ఖర్చు చేయాల్సి వస్తే సంబంధిత కాంట్రాక్టర్‌కు కూడా డిజిటల్ పద్ధతిలోనే చెల్లించాలి. దీంతో ఎలాంటి అవినీతికి అస్కారం ఉండదు.

అవగాహన కార్యక్రమాలు

జిల్లాలోని 697 పంచాయతీల నుంచి ఏటా ఇంటి పన్నుల రూపంలో రూ.13.02 కోట్లు వసూలవుతోంది. కొళాయి, ఇతర పన్నుల రూపంలో రూ.8.10 కోట్లు వస్తోంది. ఆగస్టు 15 తర్వాత పన్ను వసూలు లావదేవీలన్నీ కూడా ఆన్‌లైన్ ద్వారా చేపట్టనున్నారు. నగదు రూపంలో పంచాయతీ అధికారులు స్వీకరించరు. ఈ దిశగా పంచాయతీ అధికారులు గ్రామ పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. దీనిపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటి పన్నులు, కొళాయి పన్నుల వసూలు మాత్రమే కాకుండా పంచాయతీలు కొనుగోలు చేసే బ్లీచింగ్, పారిశుద్ధ్య మెటీరియల్, వీధి లైట్ల స్పేర్‌పార్టులు, గ్రామ పంచాయతీల్లో జరిగే అభివృద్ధి పనులకు సైతం డిజిటల్ విధానంలోనే చెల్లింపులు జరుగుతాయి.

ఆదేశాలు వచ్చాయి



“ఆగస్టు 15 తర్వాత పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు జరగాలని రాష్ట్ర పంచాయతీరాజ్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీని పై కార్యదర్శులకు సమాచారం తెలియజేశాం. ఆన్‌లైన్ చెల్లింపులకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీ ఖాతాలు ఉన్న బ్యాంకుల నుంచి క్యూఆర్ కోడ్‌లు తీసుకుంటున్నాం. డిజిటల్ చెల్లింపులపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించాం. – లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి

యువతి ఆచూకీ లభ్యం

సోమల: మిస్సింగ్ కేసులో యువతి ఆచూకీ లభించినట్లు సోమల ఎస్‌ఐ వెంకట నరసింహులు గురువారం తెలిపారు. మండలంలోని ఇరికిపెంట పంచాయతీ ఎర్రనాగులవారిపల్లెకు చెందిన యువతి (17) కనిపించడం లేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పేర్కొన్నారు. తండ్రికి తెలియ కుండా ఆమె బంధులవుల ఇంటిలో ఉన్న విషయం గుర్తించి తీసుకోచ్చామన్నారు. మండల మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచి తండ్రికి అప్పగించినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి భర్త మృతి

– భార్యకు తీవ్ర గాయాలు



రియాజ్ మృతదేహం

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట–చౌడేపల్లె మార్గమధ్యంలోని చెన్నారెడ్డిపల్లి చెరువు మొరవ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో భర్త మృతి చెందాడు. భార్యకు తీవ్రగాయాలయ్యాయి. పెద్దపంజాణి హెచ్‌సీ అశోక్ కుమార్ కథనం మేరకు వివరాలు. మండలంలోని మల్లసముద్రం గ్రామానికి చెందిన ఖాసింసాబ్ కుమారుడు రియాజ్ (42) పలమనేరులో తాళం చెవుల దుకాణం పెట్టుకుని జీవనం చేస్తున్నాడు. గురువారం భార్య అయేషాతో కలసి ఆక్సిస్ 125 వాహనంలో సొంత పనుల నిమిత్తం స్వగ్రామమైన మల్లసముద్రంకు వెళ్లారు. పనులు ముగించుకున్న అనంతరం పలమనేరుకు బయలు దేరారు. ఈ క్రమంలో చెన్నారెడ్డిపల్లె చెరువు మొరవ మలుపు వద్ద వాహనం అదుపు తప్పడంతో కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన భార్య, భర్తలను స్థానికులు రాయలపేట పీహెచ్‌సీకి తరలించారు. రియాజ్ పరిస్థితి విషమించడంతో పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. అయేషాను పలమనేరు ఏరియా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ అశోక్ కుమార్ పేర్కొన్నారు.

అడవిలో గంటావూరు వాసి ఆత్మహత్య

– వేధింపులతోనేనంటూ కుటుంబ సభ్యుల ధర్నా



మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) మృతుడు గోపి(ఫైల్)

పలమనేరు: మున్సిపల్ పరిధిలోని గంటావూరుకు చెందిన గోపి(40) పట్టణ సమీపంలోని మొగిలి ఘాట్‌లో చెట్టుకు ఉరేసుకుని మృతిచెందిన సంఘటన గురువారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. గోపి లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించే వాడు. ఇటీవల పలమనేరు నుంచి బరంపూర్‌కు లోడ్‌తో వెళ్లిన గోపిపై లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్‌కుమార్ రూ.45 వేలతో డ్రైవర్ ఉడాయించాడంటూ సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టాడు. ఈ నేపథ్యంలో గోపి అడవిలో చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించాడు. దీనిపై అతని కుటుంబసభ్యులు ఆత్మహత్యపై అనుమానం ఉందని, ఇందుకు లారీ యజమానుల సంఘం అధ్యక్షుడే కారణమని, చర్యలు తీసుకోవాలంటూ పట్టణంలో మృతదేహంతో ధర్నా చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వారికి నచ్చజెప్పి, విచారణ చేసి న్యాయం చేస్తామంటూ హామీ ఇవ్వడంతో వివాదం సర్దుమణిగింది.

శ్రీవారి హుండీలో చోరీ చేసిన వ్యక్తికి జైలు

తిరుపతి లీగల్: తిరుమల శ్రీవారి హుండీలో సొమ్మును అపహరించిన కేసులో కర్నూలు జిల్లా, కోసిగి మండలం, జంపాపురానికి చెందిన జీ.రామకృష్ణ అలియాస్ ఆనంద్‌కు రెండు నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. గత నెల 15వ తేదీ తిరుమల శ్రీవారి ఆలయంలోని కొత్త హుండీలో నిందితుడు రామకృష్ణ రూ.5,600 అపహరించాడు. సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకున్నారు. టీటీడీ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తిరుమల ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు రామకృష్ణను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

కర్ణాటక మద్యం పట్టివేత



తవణంపల్లె : నిందితురాలి అరెస్ట్ చూపుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్: గుడిపాల మండలం పాపిశెట్టిపల్లెలో గురువారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేశారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓంమూర్తి అనే వ్యక్తిని అరెస్టు చేసి, 20 బాటిళ్ల మద్యం స్వాధీనం చేసు కున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

తవణంపల్లె మండలంలో..

చిత్తూరు అర్బన్: తవణంపల్లె మండలంలో గురువారం ఎస్‌ఈబీ అధికారులు చేపట్టిన దాడుల్లో 15 మద్యం బాటిళ్లు పట్టుబడింది. మొదాలపల్లెకు చెందిన రామక్క(42) నుంచి 15 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చూపించి నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం, మమత, వెంకటేష్, మోహన, రేఖ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు





టీటీడీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన భూమన కరుణాకరరెడ్డిని తిరుమలలో కలిసి అభినందనలు తెలియజేస్తున్న మంత్రి ఆర్కే రోజా, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు - తిరుమల

వినాయకునికి వెండి కిరీటం



దేశీయ ఆవు, దూడను అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామికి ఎన్‌ఆర్‌ఐ(లండన్) శ్యామ్‌సుందర్ రావు వెండి కిరీటాన్ని కానుకగా ఆలయ అధికారులకు అందించారు. గురువారం దాత కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. దేవస్థానం ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డిని కలిసి 2కిలోల 500 గ్రాములు(విలువ రూ.2.50లక్షలు) వెండి కిరీటాన్ని అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు.

గోశాలకు దేశీయ ఆవు, దూడ

కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం గోశాలకు చిత్తూరుకు చెందిన సుబ్బరాజన్ కుటుంబ సభ్యులు గురువారం దేశీయ ఆవు, దూడను కానుకగా అందించారు. అలాగే గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.50వేలను ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశుకు విరాళంగా అందించారు. దాత కుటుంబ సభ్యులకు వారు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు.

నమ్ముకున్న కార్యకర్తను ఆదుకున్న మంత్రి రోజా



నష్టపరిహారం నగదును అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా

- వీధిన పడిన మహిళ కుటుంబానికి అండ
- ప్రైవేట్ ఫ్యాక్టరీ నుంచి రూ. 15 లక్షల పరిహారం అందజేత

నగరి : నమ్ముకున్న కార్యకర్తకు తానెప్పుడూ అండగా ఉంటానని వారికోసం ఎంతవరకైనా పోరాడుతానని మంత్రి ఆర్కేరోజా మరోమారు నిరూపించారు. ప్రైవేట్ ఫ్యాక్టరీలో జరిగిన ఒక ప్రమాదంలో యుక్త వయస్సులో భర్తను కోల్పోయి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిపోయిన కె.యువశ్రీ (23) అనే యువతికి సంబంధిత ఫ్యాక్టరీ నుంచి నష్టపరిహారంగా రూ.15 లక్షలు అందేలా చేశారు. నగరి మండలం అయనంబాకం గ్రామానికి చెందిన మురగారెడ్డి కుమార్తె కె.యువశ్రీ భర్త నాయుడుపేటలోని గ్రీన్ టెక్ ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేసేవారు. వీరికి ఆరు నెలల బిడ్డ కూడా ఉన్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 18వ తేదీన ఆయన ఫ్యాక్టరీలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు అక్కడే మరణించాడు. దీంతో 6 నెలల పసిబిడ్డ ఉన్న యువశ్రీకి భవిష్యత్తు అంధకారంగా మారింది. కుమార్తె పరిస్థితి ఆమె తల్లిదండ్రులను కలచివేసింది. దీంతో వారు మంత్రి రోజాను సంప్రదించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని మంత్రి సంప్రదించారు. ఆరునెలల బిడ్డతో వీధినపడ్డ యువశ్రీకి రూ. 15 లక్షల పరిహారం అందేలా చేశారు. గురువారం తన నివాసం వద్ద నష్ట పరిహారం నగదును యువశ్రీ కుటుంబానికి ఆమె అందించారు. నష్టపరిహారం అందించడంలో సహకరించిన మంత్రికి, ఆమె సోదరుడు రాంప్రసాద్ రెడ్డికి బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మీ మేలు ఎప్పటికీ మరిచిపోలేనఅంటూ యువశ్రీ తెలిపారు.

స్థూల నమోదు నిష్పత్తి పెంపునకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) పెంపునకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీఈఆర్ తక్కువగా ఉన్న మండలాల్లో ఎంపీడీవో, ఎంఈవోలు ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలన్నారు. ఆయా గ్రామాలలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి 5 నుంచి 18 సంవత్సరాల పిల్లలు ఎంత మంది చదువుతున్నారు, ఎంత మంది చదవడం లేదో సర్వే చేయాలన్నారు. బడిబయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తే జీఈఆర్ పెరుగుతుందన్నారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు పంపిన ఫార్మెట్‌లో వివరాలను ఎంపీడీవోలకు పంపించాలని చెప్పారు. ఆధార్ కార్డులు ఉన్న పిల్లలందరూ పాఠశాలల్లో చదివేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నాడు నేడు పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. డీఈవో విజయేంద్ర రావు, ఏపీసీ వెంకటరమణారెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నెలాఖరు లోపు రెండవ దశ భూ రీ సర్వే

జిల్లాలో రెండవ దశ భూ రీ సర్వే ఈ నెల 31 లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రెండవ దశ రీ సర్వే పురోగతి విజయవాడలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి కలెక్టర్, జేసీ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ హద్దు రాళ్ల నాటే ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలన్నారు. జేసీ శ్రీనివాసులు, డీఆర్‌వో రాజశేఖర్, జిల్లా సర్వే శాఖ అధికారి గౌసబాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే 100 శాతం పూర్తి చేయాలి

ఇంటింటి సర్వే 100 శాతం పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా కలెక్టర్‌లను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024 పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం విధి విధానాల మేరకు జిల్లాలో ప్రణాళిక ప్రకారం కసరత్తు చేపడుతున్నట్లు తెలిపారు. జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పర్వీన్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌లో భోళాశంకర్ చిత్రం టికెట్ల విక్రయాలు

- బెనిఫిట్ షో పేరుతో టికెట్ రూ.700
- జేసీకి ఫిర్యాదు చేసిన అభిమానులు
- దాడులకు దిగిన రెవెన్యూ అధికారులు
- అనధికారికంగా షోలు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



థియేటర్ వద్ద తహసీల్దార్ బృందం తనిఖీ



సీడీ సెంటర్ వద్ద అధికారుల తనిఖీలు

చిత్తూరు రూరల్: భోళా శంకర్ చిత్రం శుక్రవారం విడుదల కానున్న ఈ నేపథ్యంలో చిత్తూరులో థియేటర్ నిర్వాహకులు, అభిమానుల సంఘ కలిసి అనధికారికంగా బెనిఫిట్ షోకు సిద్ధమయ్యారు. గురువారం మధ్యాహ్నం నుంచి టిక్కెట్ల విక్రయం ప్రారంభించారు. శుక్రవారం తెల్లవారు జామున 5 గంటలకు బెనిఫిట్ షో అంటూ టిక్కెట్లను అధిక ధరలకు విక్రయించారు. కొందరు టిక్కెట్ రూ.500లకు విక్రయించగా మరికొందరు బ్లాక్‌లో రూ.700లకు విక్రయిస్తున్నారని.. ఆగ్రహానికి గురైన అభిమానులు, సినీ ప్రేక్షకులు జేసీ శ్రీనివాసులు, ఆర్డీఓ రేణుకకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు తహసీల్దార్ మురళీమోహన్, డీటీలు కిరణ్, ధనంజయ్యలు, వీఆర్‌ఓలు బృందంగా వెళ్లి దాడులు చేపట్టారు. తొలుత ఎంఎస్‌ఆర్ సర్కిల్‌లోని ఓసీడీ సెంటర్‌లో తనిఖీలు చేస్తే 30 టిక్కెట్లు పట్టుపడ్డాయి. ఆ టిక్కెట్లు ఎక్కడిదంటూ అధికారులు ఆరా తీశారు. సెంటర్ నిర్వాహకుడి నుంచి రాతపూర్వకంగా వివరణ తీసుకున్నారు. అనంతరం విమెగా టాకీస్‌లో కూడా దాడులు చేశారు. టిక్కెట్ కౌంటర్‌కు వెళ్లి తహసీల్దార్ టిక్కెట్ అడిగారు. కౌంటర్‌లోని యువకుడు ఇస్తామని చెప్పి తర్వాత హౌస్‌ఫుల్ బోర్డు పెట్టేశాడు. దీంతో తహసీల్దార్ ఆగ్రహానికి గురికావడంతో రెండు టిక్కెట్లు కొట్టి ఇచ్చాడు. తర్వాత టిక్కెట్ల గోలపై థియేటర్ యజమానితో రాత పూర్వకంగా వివరణ తీసుకున్నారు. అధిక ధరలకు విక్రయించకూడదని, బెనిఫిట్ షోలకు అనుమతి లేదని, నిర్ణీత ధరలకే టిక్కెట్లు విక్రయించాలని సూచించారు.

బెనిఫిట్ షోకు అనుమతి లేదు

తహసీల్దార్ మీడియాతో మాట్లాడుతూ బెనిఫిట్ షోలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. అభిమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు థియేటర్లపై తనిఖీలు చేశామన్నారు. ఈ తనిఖీలో 30 టిక్కెట్లు పట్టుబడ్డాయన్నారు. విచారిస్తే ఆ టిక్కెట్లు ఫ్యాన్స్ కోసమంటూ తప్పించుకున్నారని చెప్పారు. శుక్రవారం ఉదయం కూడా తనిఖీలు కొనసాగుతాయన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను బెనిఫిట్ షోలు వేయకూడదని, నిర్ణీత సమయానికి మాత్రమే షోలు వేసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే థియేటర్ యజమానులపై చర్యలు తప్పవన్నారు. తనిఖీ వివరాలను నివేదికల రూపంలో ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆయన పేర్కొన్నారు.